సఖీ కేంద్రంలో న్యాయసేవ సదస్సు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయసేవలో భాగంగా బుధవారం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి న్యాయసేవ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టపరంగా మహిళలకు రకరకాల చట్టాలు రక్షణ కోసం ఉన్నాయని తప్పకుండా మహిళలకు న్యాయం జరిగేలాగా చట్టం సహకరిస్తుందని అన్నారు. వీటితో పాటు వివాహ బంధంలో సంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లతో కూడుకుని ఉంటుందని తెలిపారు. గృహహింస కేసుల్లో మహిళలు ఎలాంటి మనోవేదనకు గురి కావొద్దన్నారు.


కామారెడ్డిలో దీపెంతలను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆనందాల కేళి దీపావళి

- నేడే దీపావళి
- కిటకిటలాడుతున్న వ్యాపార సముదాయాలు
- బంతి పువ్వులకు భలే గిరాకీ
- ఆకాశాన్ని అంటుతున్న టపాకాయల ధరలు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆనందల కేళి దీపావళి పండుగ రానే వచ్చేసింది. ఇంటిల్లి పాది కుటుంబ సభ్యులతో, పిల్లా పాపలతో ఆనందంగా జిల్లా వ్యాప్తంగా గురువారం దీపావళి పండుగ జరుపుకునేందుకు ప్రజలు, వ్యాపారులు సిద్ధమయ్యారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలతో పాటు అన్ని మండల కేంద్రాల్లో దీపావళి సందడి జోరందుకుంది. విద్యుత్ దీపాలతో వెదజిల్లే దీపాలను గుమ్మం ముందు ఏర్పాటు చేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. దీపావళి పండుగ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో మార్కెట్‌లో వ్యాపార సముదాయాలు కిటకిటలాడాయి. రోడ్లు జనాలతో నిండిపోయాయి. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవడం, పంటలు మంచిగా పండడంతో గ్రామాల్లో సైతం పండుగ వాతావరణం కనబడుతోంది.

లక్ష్మీ పూజలకు ఏర్పాట్లు

దీపావళి పండుగ అంటే ప్రధానంగా గుర్తుకు వచ్చేది లక్ష్మీపూజలు. ఇళ్లలోని, వ్యాపార సముదాయాల్లోని, షోరూముల్లోని పెద్ద సంస్థల్లోనూ పండుగ రోజు ప్రత్యేకంగా లక్ష్మీ పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తుంటారు. ముహుర్తాన్ని సైతం అర్చకుల సలహాలతో పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. షోరూములు, దుకాణ సముదాయాల ఎదుట అరటి కొమ్మలు, మామిడాకులు, రంగు రంగుల పువ్వులతో పాటు విద్యుత్ కాంతుల దీపాలతో సుందరంగా అలంకరించారు. దీపావళి పండుగ సందడి తెచ్చేసింది. పండుగ పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా కేంద్రంలో పండుగ సందడి నెలకొంది. రోడ్లన్నీ వ్యాపారాలతో సందడిగా మారింది. సుభాష్‌రోడ్, మాయాబజార్, జేపీఎన్ రోడ్ ప్రాంతాలతో పాటు కొత్తబస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తాలో రద్దీ ఉంది. టపాకాయలు, పేనీలు, పూజల కోసం బంతిపూలు, ఫొటోఫ్రేమ్‌లు, దీపాల వెలుగుల కోసం వివిధ ఆకృతుల్లో దీపెంతలు వ్యాపారాలు జోరుగా ఉన్నాయి. బట్టల, కిరాణ దుకాణాలు సైతం కిక్కిరిసిపోయాయి. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పట్టణానికి వచ్చి పండుగ సామగ్రి కొనుగోలు చేశారు.

సందడిగా మారిన వ్యాపార సముదాయాలు

తక్కువ సమయంలోనే ఎక్కువ లాభం కలిసి వచ్చే వ్యాపారాల వైపు చిరు వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. కేవలం రెండు మూడు నెలల్లోనే లక్షల రూపాయల వ్యాపారం కొనసాగిస్తున్నారు. జిల్లాలోని కామారెడ్డి పట్టణంలో సీజనల్ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం దీపావళి పండుగ రావడంతో దీపెంతలు, దొంతులు, పేనీలు, సేమియాలు, టపాసుల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఒక కామారెడ్డిలోనే రెండు నెలల కాలంలోనే సీజనల్ వ్యాపారం కోట్ల రూపాయాల్లో కొనసాగుతోంది. రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో ఫుట్‌పాత్ వ్యాపారం లాగానే కనిపిస్తున్నప్పటికీ లక్షల వ్యాపారం చేసి చిరు వ్యాపారులు సీజన్‌లో డబ్బులు సంపాదిస్తున్నారు. టపాసులు లక్షల వ్యాపారం కాగా దీపెంతలు, దొంతులు, సేమియాలు, పేనీలు వేల రూపాయల్లో వ్యాపారం సాగిస్తున్నారు. ఈ సంవత్సరం గత ఏడాది కంటే తక్కువగానే వ్యాపారం సాగుతుందని చిరు వ్యాపారులు తెలిపారు. కొనుగోలుదారుల ఆసక్తిని బట్టి రెండు నెలల పాటు మాత్రమే దీపావళి సీజన్ వ్యాపారం సాగుతుందని వ్యాపారులు తెలిపారు.

బంతి పువ్వులకు భలే గిరాకీ

దీపావళి పండుగ వచ్చిందంటే చాలు జిల్లా కేంద్రంతో పాటు ప్రధాన మండలాల్లోని బంతి పువ్వులకు భలే గిరాకీ నెలకొంటుంది. ఇందుకోసం పువ్వుల వ్యాపారులు బంతి పువ్వులను, చామంతి పువ్వులను పక్క జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద మొత్తంలో దిగుమతి చేశారు. ఈ పండుగకు మార్కెట్‌లో బంతి పువ్వులకు భలే గిరాకి ఉంది.

ధాన్యం కొనుగోళ్లు షురూ!



- ప్రభుత్వ ఆదేశాలతో కొనుగోళ్లను ప్రారంభించిన అధికారులు
- షూరిటీ ఇచ్చిన రైస్‌మిల్లర్లకే ధాన్యం కేటాయింపులు
- కొలిక్కిరాని మిల్లర్ల ధాన్యం కేటాయింపులు
- జిల్లా వ్యాప్తంగా 411 సేకరణ కేంద్రాల ఏర్పాటు
- ఈ సీజన్‌లో సన్నాలు, దొడ్డు రకం వేర్వేరుగా సేకరణ
- 5.80లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్ల లక్ష్యం

కామారెడ్డి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో ఎట్టకేలకు ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి. కొనుగోలు కేంద్రాలను 20 రోజుల కిందటే ప్రారంభించినప్పటికీ కాంట మాత్రం జరగలేదు. కేంద్రాలకు రైతులు భారీగా ధాన్యాన్ని తరలిస్తుండడంతో కుప్పలు తెప్పలుగా ధాన్యం రాశులు పేరుకుపోయాయి. మరోవైపు అకాల వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం తడిసిపోవడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోళ్లలో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలకు కసరత్తు చేస్తుండడంతో జాప్యం జరుగుతూ వచ్చింది. సన్నాలకు బోనస్, దొడ్డు, సన్నాలు వేర్వేరుగా కొనుగోలు, రైసుమిల్లులకు ధాన్యం కేటాయింపు, షూరిటీ ఇచ్చి న మిల్లర్లకే ధాన్యం ఇవ్వాలని అనే అంశాలపై ప్రభుత్వం కసరత్తు చేయడంతో ఇప్పటి వరకు కొనుగోళ్లు చేపట్టలేదు. ప్రభుత్వం తాజాగా కొనుగోలు జరపాలని ఆయా జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలో బుధవారం నుంచి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

5.80 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్ల లక్ష్యం

జిల్లాలో ఈ సీజన్‌లో వరి సుమారు 3 లక్షల ఎకరాల వరకు సాగైంది. ఇందులో 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ నివేదించింది. ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలకు 5.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉంటుందని పౌర సరఫరాల శాఖ అంచనా వేసింది. ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 411 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ సీజన్‌లో దొడ్డు, సన్న రకం ధాన్యం వేర్వేరుగా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. సన్నాలకు ప్రభుత్వం రూ.500ల బోనస్ ఇవ్వను న్న నేపథ్యంలో వేర్వేరుగా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లాలో 63 సన్నాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని 348 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కేంద్రాల్లో కాంటా చేయాలంటూ ఆదేశాలు

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం కాంటా చేయాలంటూ ప్రభుత్వం నుంచి తాజాగా ఆదేశాలు వచ్చాయి. దీంతో బుధవారం నుంచి కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతుల ధాన్యాన్ని కాంటా చేస్తున్నారు. గత 20 రోజుల కిందటే జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఆయా అధికారులు ప్రారంభించారు. అయితే ప్రభుత్వం నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో అధికారులు కేంద్రాల్లో ధాన్యం కాంటా చేయలేదు. దీనికి ప్రధాన కారణం మిల్లర్లకు ధాన్యం కేటాయింపుల కోసం ప్రభుత్వం కొన్ని నిబంధనలను పెట్టింది. మిల్లర్లు షూరిటీ ఇస్తేనే కేటాయింపులు చేస్తామని చెప్పుకొచ్చింది. అదే విధంగా సన్నరకం ధాన్యాన్ని మర ఆడిస్తే తాము తీవ్రంగా నష్టపోతామని దీంతో సన్న ధాన్యం తీసుకోబోమని మిల్లర్లు సైతం పేచీ పెట్టారు. మరోవైపు సన్నాలకు బోనస్ ప్రభుత్వం కేటాయించినందున కొనుగోళ్లపై కసరత్తు చేపట్టింది. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రారంభించినప్పటికీ కొనుగోలు మాత్రం చేపట్టలేదు. నియమ నిబంధనలు ఖరారు చేసిన తర్వాతే కొనుగోళ్లపై స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది.

షూరిటీ ఇచ్చిన రైసుమిల్లర్లకే ధాన్యం కేటాయింపులు

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఆయా రైసుమిల్లులకు కేటాయించి అదే ధాన్యాన్ని సీఎంఆర్ రూపంలో ప్రభుత్వం బియ్యాన్ని సేకరిస్తూ వస్తోంది. అయితే గత కొన్నేళ్లుగా రైసుమిల్లర్లకు ధాన్యం కేటాయిస్తే అక్రమాలకు పాల్పడుతున్నారని దీంతో ప్రభుత్వం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ధాన్యం కేటాయింపులో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నిబంధనలను రూపొందించింది. ఈ కారణంతోనే ధాన్యం కొనుగోళ్లలో కాస్త జాప్యం నెలకొంటూ వచ్చింది. బ్యాంకు షూరిటీ ఇస్తేనే రైసుమిల్లర్లుకు ధాన్యం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఆయా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నుంచి సుమారు 5.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనుంది. ధాన్యాన్ని జిల్లాలోని ఆయా బాయిల్డ్, రా రైసుమిల్లులకు కేటాయించనుంది. అయితే ధాన్యం కేటాయింపుల్లో రైసుమిల్లుల ఎంపిక ప్రక్రియ పౌర సరఫరాల శాఖ ఇంకా జరపలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతోనే రైసుమిల్లర్ల ఎంపిక నిర్వహించలేదని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని రైస్‌మిల్లర్లు బ్యాంకు షూరిటీ ఇస్తేనే వారికే ధాన్యం కేటాయింపులు ఉంటాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సైతం ఆదేశాలు జారీ చేశారు. మిల్లర్లకు ధాన్యం కేటాయింపులపై పౌర సరఫరాల శాఖ, మార్కెటింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

మిల్లర్లు ధాన్యానికి బ్యాంకు పూచికత్తు ఇవ్వాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మిల్లర్లు ధాన్యానికి బ్యాంకు పూచికత్తు ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరం వరి ధాన్యాన్ని తీసుకునే ప్రతీ మిల్లర్ వ్యక్తిగత బ్యాంకు పూచికత్తు తప్పనిసరిగా సమర్పించాలని కోరారు. అలాగే మిల్లర్లు ధాన్యాన్ని తొందరగా మిల్లుల్లో దించుకోవాలని ఆయన సూచించారు. మిల్లర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా మేనేజర్ రాజేందర్, డీసీఎస్‌వో నరసింహారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలు సిద్ధం

- పేకాటరాయుళ్లకు అధికార పార్టీ నేతల అండ
- భారీగా ఆటలో కేటీ తీసేందుకు సన్నాహాలు
- ఆటలతో తీసిన కేటీతో పేకాటరాయుళ్లకు విందులు
- స్థానిక రాణా నుంచి మొదలుకొని డివిజన్ అధికారుల వరకు ముడుపులు?

7



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఆర్మూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఆర్మూర్‌టౌన్ అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పిప్రిరోడ్డు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద, పెర్కిట్‌లోని బైపాస్ వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈనెల 29న ఆర్మూర్ లో కొను గోలు కేంద్రం ప్రారంభం ఎప్పుడు..? అనే శీర్షికను 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితం కావడంతో అధికారులు, నాయకులు స్పందించి మెప్మా ఆధ్వర్యంలో బుధవారం కొను గోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసంద ర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా నిర్వహించే కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని,దళారులను నమ్మిమోసపోవద్దని, గ్రేడ్-1 రకం ధాన్యానికి రూ.2320, గ్రేడ్ -2 రకం ధాన్యానికి రూ.2300 మద్దతు ధర లభి స్తుందని, దీంతో పాటు సన్నరకానికి రూ.500బోనస్ ప్రభుత్వం అందజే స్తుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గజానన్, మున్సిపల్ కమిషనర్‌రాజు, మున్సిపల్ వైస్‌చైర్మన్ 'షేక్ మున్న, కౌన్సిలర్‌లు ఆకుల రాము,శాలప్రసాద్, ఇట్టెడి నర్సారెడ్డి, లిక్కి శంకర్, ఫ యాజ్, మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, సీవో రాజలింగం, నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని రైలు ఢీ కొని మహిళ మృతి

ఖిల్లా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):గుర్తు తెలియని రైలు ఢీ కొని మహిళ మృతి చెందిన ఘటన నగరంలోని అర్సపల్లి ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది.రైల్వే ఎస్ఐ సాయిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆచన్‌పల్లికి చెందిన అసది సుజాత(38)కు అర్సపల్లికి చెందిన అసాది రవితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. తరుచు భర్తతో గొడవ పడేదని,కొన్ని సందర్భాల్లో పక్కింటి వారితో సైతం గొడవ పడేదని తెలిపారు. అందులో భాగంగానే మంగళవారం భర్తతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త అసాది రవి చుట్టుపక్కల వెతికిన ఫలితం దక్కలేదు. స్థానికుల ద్వారా సమాచారం అందుకుని ఘటన స్థలానికి చేరుకుని మృతురాలిని పోస్ట్ మార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. ఆమె మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని భర్త పోలీసులకు తెలిపారు. కేసున మోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి

సిరికొండ,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలన్నీటిని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ అర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేస్ డిమాండ్ చేశారు. సిరికొండలో బుధవారం తహసీల్దార్ రవీందర్‌రావుకు వినతి పత్రం అంద జేశారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బాబన్న,మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు రిక్కా దామోదర్, ఏఐపీ కేఎస్ నాయకులు లింబాద్రి, సాయరెడ్డి,ఈ.రమేష్,కిషోర్,అనీష్,ఆశీష్, పాల్గొన్నారు.

జల్లాపల్లి ఫారంలో పేకాట కేంద్రంపై దాడి

కోటగిరి,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి):పోతంగల్‌లోని జల్లాపల్లిఫారం గ్రామంలో మంగళవారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.పేకాట కేంద్రంలో ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశామన్నారు.వారివద్ద నుంచి రూ. 7350నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

గ్రామానికి దూరంగా పొగాకు బట్టీలను ఏర్పాటు చేయాలి

రెంజల్,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి):కందకుర్తి గ్రామంలో రైతులు పండించిన పొగాకు బట్టీలు గ్రామంలో నివాస ప్రాంతాలలో ఏర్పాటు చేయడం వల్ల పొగ ద్వారా అనారోగ్యాల బారిన పడుతున్నామని, ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు సైతం పొగ వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి కిలో మీటర్ దూరంలో పొగాకు బట్టిలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఖలీద్ పటేల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ వైస్ చైర్మన్‌కు సన్మానం

మోపాల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డిని బుధవారం బోర్గాం(పి) ప్రాథమిక సహకార సంఘం పాలకవర్గం సభ్యులు, గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో సొసైటీ వైస్ చైర్మన్ జె.కృష్ణ, డైరెక్టర్లు దాసు, ఈగ సాయరెడ్డి, నారాయణ, మహేందర్‌రెడ్డి, గుత్ప నరేష్, రాజశేఖర్‌రెడ్డి, బుజేందర్, సాయిబాబా, సొసైటీ మాజీ చైర్మన్ సూర్యరెడ్డి, మాజీ సర్పంచులు సాయరెడ్డి, ఈగశ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు నాగభూషణం, బీజేపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బాధితురాలికి ఎల్‌వోసీ అందజేత

కమ్మర్‌పల్లి,అక్టోబరు 30:(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన యేళ్ల చిన్నుబాయి గత కొంత కాలంగా వెన్నుముఖ నొప్పితో బాదపడుతూ.. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెకు వైద్యఖర్చుల నిమిత్తం రూ.రెండు లక్షల ఎభైవేల ఎల్‌వోసీ అందజేశారు. ఈ విషయం స్థానిక కాంగ్రెస్ నాయకులు ద్వారా తెలుసుకున్న బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ సీఎం సహయనిధి నుంచి రూ.2లక్షల 50 వేల ఎల్‌వోసీని మంజూరు చేయించారని నాయకులు తెలిపారు. సునీల్ కుమార్‌కు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కోటగిరిలో కంటి వైద్య శిబిరం

కోటగిరి,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని వినాయక్ నగర్ కాలనీలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రవి, హన్మంత్ రావు, సంతోష్, సాయిలు, గంగాప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి 100కు డయల్

● రెండు రోజుల జైలు శిక్ష

ధర్పల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):మద్యం సేవించి 100 కు డయల్ చేసిన వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రామకృష్ణ బుధవారం తెలిపారు. మండలంలోని డీబీ తాండాకు చెందిన గణేస్ అనే వ్యక్తి మద్యం సేవించి 100కు డయల్ చేయడంతో ఆయనపై కేసు నమోదు చేయగా సదరు వ్యక్తికి జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ధర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మండల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే 100కు డయల్ చేయాలని ఎస్సై సూచించారు.

బాధిత కుటుంబాల పరామర్శ

● అంత్యక్రియలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్


నివాళులర్పిస్తున్న కుడుముల సత్యనారాయణ

ఎల్లారెడ్డి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):ఎల్లారెడ్డి మండలంలోని శివనగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మోహన్‌గౌడ్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మున్సి౼ఎల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన ప్రము ఖ న్యాయవాది ఇమ్మానుయేల్ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త దండు రత్నయ్య మృతి చెందగా వారి ఇంటి వద్దకు వెళ్లి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పార్టీ పరంగా కార్యకర్తలకు న్యాయం జరిగే విధంగా ఎమ్మెల్యేకృషితో బాధ్యత కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. ఆయనతో పాటు నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సామెల్, సాయిలు ఉన్నారు.

సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తాం

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


నాగేపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుదర్శన్ రెడ్డి

నవీపేట,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత సీజన్ నుంచి సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500ల చొప్పున బోనస్ చెల్లించడం జరుగుతుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నాగేపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో కొందరు రైస్‌మిల్లర్లు వందల కోట్ల రూపాయల విలులైన ధాన్యాన్ని పక్కదారి పట్టించారని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ధాన్యాన్ని తీసుకుని 90శాతానికిపైగా బియ్యాన్ని వెనక్కి ఇచ్చిన రైస్‌మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీతో ప్రస్తుత సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని కేటాయిస్తున్నామని అన్నారు. ఇటీవల పలుచోట్ల కల్తీ పాలు, ఆహార వస్తువులు విక్రయిస్తుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.గత 10సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న గ్రూప్-1 ఉద్యోగ పోటీ పరీక్షలను తమ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిందని గుర్తు చేశారు. అధికారులను ఇబ్బందులకు గురి చేస్తే ఉపేక్షించేది లేదని అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగేపూర్ సొసైటీ చైర్మన్ శైలేష్‌కుమార్, నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ రాంచందర్, శ్రీనివాస్‌గౌడ్, మద్దెపల్లి కిషన్ రావు, శ్రీధర్ బాబు, లక్ష్మీనారాయణగౌడ్,భగవాన్,బాబు పాల్గొన్నారు.

● ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రెంజల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం ప్రొపెరేటర్ సనా హాలీహత్ అన్నారు. బుధవారం మండలంలోని తాడ్‌బిలిలో గ్రామంలో ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం ఆధ్వర్యంలో దూపల్లి సొసైటీ ఆధ్వర్యంలో చైర్మన్ భూంరెడ్డి అధ్యక్షతన నీలా సొసైటీ చైర్మన్ ఇమామ్ బేగ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శులు రాందాస్, జీవన్‌రెడ్డి, నాయకులు మొగులనా, శ్రీనివాస్, ఖద్దుస్, సుధాకర్, గంగాధర్, బాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

● రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సహకార సంఘం అధ్యక్షులు దాసరి అంతయ్య వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం పండించిన వరిని దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్, సొసైటీ డైరెక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.

● రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే వి క్రయించాలి

కమ్మర్‌పల్లి: రైతుల సౌకర్యార్థ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకల్పిఇంచేనిమిత్తం ఏర్పాటు చేసిన వరి కొనులు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్య అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి సొసైటిలో చైర్మన్ రేగుంట దేవేందర్ తో కలిసి వరి కొనుగోలు కేంద్రన్ని ప్రారంభిఇంచారు. రైతులు నిబంధనల ప్రకారం వరిధాన్యన్ని కొనుగోలు కేంద్రాలలో విఇక్రయించి ప్రభుత్వ మద్దతు ధరలు పొందాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, సొసైటి డేరెక్టర్‌లు రెంజర్ల మహేందర్, కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీఏఈవో రమేష్, రైతులు బుచ్చిమల్లయ్య, సంత రాజేశ్వర్, కొమ్ముల రాజేశ్వర్, రఘు కార్యదర్శి శంకర్, సిబ్బంది పాల్గన్నారు.

● ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

వేల్పూర్:ధాన్యాన్ని మధ్యదళారులకు అమ్మిమోస పోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని పడిగెల సొసైటీ చైర్మన్ యాల్ల హన్మంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ యాల్ల హన్మంత్‌రెడ్డి ప్రారంభించారు.కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ సీఈవో మోహన్, డైరెక్టర్‌లు, రైతులు, సొసైటీ సిబ్బంది, పాల్గొన్నారు.

● కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

భీమ్‌గల్: ప్రభుత్వం రైతులకు మద్దతు ధర అందించేందుకు ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఏఎంసీచైర్మన్ పాలెపు నర్సయ్య తెలిపారు. బుధవారం మండలంలోని ముచ్కూర్ సొసైటీ ఆధ్వర్యంలో పిప్రి, బాచన్‌పల్లి, ముచ్కూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ వైస్‌చైర్మన్ సుంకెట బుచ్చన్న, ముచ్కూర్ పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్, వైస్‌చైర్మన్ గంగారెడ్డి, వివిధ గ్రామాల సొసైటీ డైరెక్టర్‌లు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు స్వామి, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటా కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి


ఎన్యూమరేటర్లకు శిక్షణ కల్పిస్తున్న మండల ప్రత్యేక అధికారి ప్రదీప్

ఎడపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నవంబరు 6నుండి 18వరకు చేపట్టే ఇంటింటి కుటుంబ సర్వేను పకబ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి ప్రదీప్ అన్నారు. బుధవారం ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల సర్వే చేపట్టాలని నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఈ సర్వే చేపట్టాలని నిర్ణయించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఎన్యూమరేటరు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల నుండి సమాచారం సేకరించాలని, 56 కాలమ్స్‌తో కూడిన పత్రాన్ని జాగ్రత్తగా నింపాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్, ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ మన్మోహన్ శర్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ రాణి, పంచాయితీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నార

నవీపేట: వచ్చే నెల 6నుండి 18వరకు జరిగే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందిగా నిర్వహించాలని తహసీల్దార్ వెంకట రమణ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన ఎన్యూమలేటర్లు, సూపర్‌వైజర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్, ఎంపీవో రామకృష్ణ, ఆర్ఐ నరేష్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు, శిక్షకులు పాల్గొన్నారు.

ధర్పల్లి: ప్రతీ కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణకై సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి డీపీవో ధర్పల్లి మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విధివిధానాలు, కార్యాచరణ గురించి వివరించారు. నవంబర్ 6 నుంచి సర్వే చేపడుతామని పేర్కొన్నారు. ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో బాలకృష్ణ, తహశీల్దార్ మాలతి, డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

● కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

జక్రాన్‌పల్లి: మండలంలో నంబర్ 6నుంచి 18వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించి కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి ప్రవీన్ అన్నారు. బుధవారం జక్రాన్‌పల్లిలోని రైతు వేదిక భవనంలో కుల గణన సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో సతీష్‌కుమార్, తహసీల్దార్ కిరణ్మాయి, వ్యవసాయాధికారిణి దేవిక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ఎన్యూమలేటర్లకు శిక్షణ తరగతులు

రెంజల్: మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం తహసీల్దార్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేపై ఇన్యూమలేటర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, ఆర్ఐ రవికుమార్, ఎంపీవో రఫీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నీనాయక్, ఏపీఎం చిన్నయ్య, పశువైద్య అధికారి పాల్గొన్నారు.

● కుల సర్వేపై శిక్షణ తరగతులు

ముప్కాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కుల సర్వే నిర్వహణ పై బుధవారం బాల్కొండ మండల ప్రత్యేక అధికారి రసూల్‌బీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణనపై చేయాల్సిన సర్వే గురించి విధివిధానాలను సూపర్‌వైజర్‌లకు, ఎన్యూమారేటర్‌లకు కుల గణనలో మర్యాదపూర్వకంగా ఉండాలని, వారు ఇచ్చిన సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని వారికి సూచించారు. గ్రామస్థులకు ముందుగా సమాచారం అందించి నవంబర్ 1నుంచి 3వ తేదీ వరకు వారికి కేటాయించిన బ్లాక్‌లో కుటుంబాలను గుర్తించి ఇళ్ల జాబితా తయారు చేసుకొని స్టిక్కర్‌లు అతికించడం జరుగుతుందన్నారు. నవంబర్ 6 నుంచి 18వ తేదీ వరుక సర్వే నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీవో గంగామోహన్, నర్సయ్య, గణేష్, ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్‌లు, ఎన్యుమారేటర్లు పాల్గొన్నారు.

భీమ్‌గల్: నవంబర్ 6నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే కుల గణన సర్వేలో పాల్గొని ఎన్యుమారేటర్‌లకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, మున్సిపల్‌కమిషనర్ రామకృష్ణ,ఎంపీవో,టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరణపై బీఆర్ఎస్ సంబరాలు

సుభాష్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకుంటూ తీసుకున్న నిర్ణయంపై బీఆర్ఎస్ నాయకులు జిల్లా వ్యాప్తంగా సంబరాలు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్ట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు టపాకులు పేల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ డిస్కం ద్వారా గత పది నెలల్లో 18,500 కోట్ల భారాన్ని ప్రజలపై మోపడాన్ని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం చేస్తే ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ వాటికి వ్యతిరేకంగా పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని ఈఆర్‌సిని ఒప్పించి విజయం సాధించిందన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకను ఈఆర్‌సి ముందు వినిపించిందన్నారు. అనంతరం మాజీ జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో నాణ్యమైన 24 గంటల కరెంటు సరఫరా చేసిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. తెలంగాణను అన్ని విధాలుగా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిన వ్యక్తి కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాంకిషన్‌రావు, సిర్పరాజు, సూదం రవిచందర్, దండుశేఖర్, సత్యప్రకాష్, ఎనుగందుల మురళి, తదితరులు పాల్గొన్నారు.


మోర్తాడ్‌లో జాతీయరహదారిపై టపాకాయలు పేల్చుతున్న దృశ్యం

మోర్తాడ్: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాల యం వద్ద జాతీయరహదారిపై బాల్కొండ నియోజకవర్గ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేల 500కోట్ల విద్యుత్ చార్జీలు పెంచాలనే ప్రయత్నాన్ని అడ్డుకొని ప్రజలపై భారం పడకుండా డెస్కం సంస్థలను సృష్టించినందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపు మేరకు భారీ ఎత్తున బీఆర్ఎస్ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీల అధ్యక్షులు, మాజీఎంపీపీలు, మాజీజడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీఎంపీటీసీసభ్యులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


మృతుల కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల

నాగిరెడ్డిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఇటీవల మరణించిన మృతుల బాధిత కుటుంబాలను బుధవారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. గ్రామానికి చెందిన పటోళ్ళ నారాయణరెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వరిగే యాదగిరి అనారోగ్యంతో మృతి చెందినందున బాధిత మృతుల కుటుంబాలను ఆయన పరామర్శించారు.మాజీ ఎమ్మెల్యే వెంట ఎల్లారెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయ కులు దుర్గారెడ్డి, జలాల్‌పూర్ మాజీ సర్పంచ్ కృష్ణ, మసాన్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

కామారెడ్డిటౌన్,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపైన వేయాలనుకున్న రూ.18,500 విద్యుత్ చార్జీల భారాన్ని ఆపడంలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్ అన్నారు.బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో టపాకాయాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలలో ఏనాడు విద్యుత్ చార్జీలు పెంచని బీఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా కేవలం 10 నెలల్లోపు 18500 కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను ప్రభుత్వం చేస్తే ప్రధాన ప్రతిపక్షంగా వాటిని వ్యతిరేకించాలని పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని ఈఆర్‌సీని ఒప్పించాగలిగామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధారి మండల ప్రత్యేకాధికారిగా లక్ష్మీప్రసన్న

గాంధారి,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గాంధారి మండల ప్రత్యేకాధికారిగా బుధవారం లక్ష్మీప్రసన్న బాధ్యతలు స్వీకరించారు.జిల్లా వ్యవసాయ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెకు గాంధారి మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు అప్పగించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వర్, ఎంపీఓ,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులో మాదక ద్రవ్యాల పట్టివేత

● ఎన్నికల వేళ ముమ్మర తనిఖీలు


వివరాలను తెలుపుతున్న పోలీసులు

బోధన్‌రూరల్,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): సాలూర అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద బుధవారం మహరాష్ట్ర ఎన్నికల వేళ పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా బస్సులు, వాహనాలను ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మహరాష్ట్ర బస్సు నుండి ఒక వ్యక్తి అనుమానిత బ్యాగు తీసుకుని వెళ్తుండగా పట్టుకున్నామని రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. అనుమానిత బ్యాగును పరిశీలించగా అట్టి బ్యాగులో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు, అల్పజోలం వంటి చిన్నచిన్న ప్యాకెట్లు లభించినట్లు ఆయన తెలిపారు. వీరిపై మాదక ద్రవ్యాల నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. ఎన్నికల వేళ మహరాష్ట్రకు వెళ్లేవారు ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. 50వేలకు మించి డబ్బులు తీసుకువెళ్లవద్దన్నారు. మత్తు పదార్థాల విలువ సుమారు 2లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని సేకరిస్తామన్నారు.త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

జిల్లా ప్రజలకు ప్రముఖుల దీపావళి శుభాకాంక్షలు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకొని జిల్లాకు చెందిన ప్రముఖులు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు కేఆర్ సురేష్‌రెడ్డి, ధర్మపురి అర్వింద్, సురేష్ షెట్కార్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఇంచార్జి సీపీ సింధూశర్మ, నుడా చైర్మన్ కేశవేణు, తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరి జీవితాలలో కష్టాలు అనే కారు చీకట్లు తొలగిపోయి చిరు దివ్వెల వెలుగులవలే అనునిత్యం సుఖసంతోషాలతో విరసిల్లాలని ఆకాంక్షించారు. దీపావళి పండుగను ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఇంటిల్లిపాది ఆనందంగా పండుగ జరుపుకోవాలని కోరారు.

2న జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీల ఎంపిక

సుభాష్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 2న జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి భూలోకం విజయ్‌కాంత్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో ఈఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అండర్-14, 16, 18 బాలురు, పురుషుల విభాగం మరియు మహిళల విభాగంలో పో టీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు సొంత రేసింగ్ సైకిల్‌తో పాటు జనన ధృవీకరణ పత్రాలను వెంటతెచ్చుకోవా లన్నారు. ఉదయం 7గంటల వరకు బైపాస్ రోడ్ మైదానానికి చేరుకో వాలన్నారు. ఇందులో ప్రతిభకనబర్చిన క్రీడాకారులను నవంబర్ 4 నుంచి 6తేదీలలో జనగాం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొం టారని తెలిపారు.వివరాల కోసం 9912883331 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

అంకాపూర్ మాజీసర్పంచ్ గడ్డం రాజన్న మృతి

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామ మాజీసర్పంచ్ గడ్డం రాజన్న (83) బుధవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆరోగ్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ఆసుపత్రిలో వెళ్లిన రాజన్న ఆకస్మాత్తుగా మృతి చెందారు.గడ్డం రాజన్న 1970 నుంచి 1988వరకు రెండు పర్యాయాలు 18ఏళ్ల పాటు, సర్పంచ్‌గా పని చేసి గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారు.అంకాపూర్‌లో సీడ్ వ్యాపారం ప్రారంభించిన ఘనత ఆయనకే దక్కింది.ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మార్క్‌ఫెడ్ చైర్మన్ మారగంగారెడ్డిలు మాజీ సర్పంచ్‌గడ్డం రాజన్న భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. శుక్రవారం అంకాపూర్‌లో అంత్యక్రియాలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం

నిజామాబాద్‌కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అఖండ భారత దేశాన్ని ఏకీకృతం చేసిన సర్దార్ వల్లభబాయ్ పటేల్ జన్మదినోత్సవమైన జాతీయ ఐక్యత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక సరస్వతీనగర్‌లోగల శబ్దతరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఐక్యత దినోత్స వంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్‌గౌడ్, లింబాద్రి, శ్రీకాంత్, పాల్గొన్నారు.

గడుగు గంగాధర్‌కు సన్మానం


గడుగు గంగాధర్‌ను సన్మానించిన రేషన్ డీలర్లు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యవసాయ సం క్షేమ కమిషన్ సభ్యుడిగా నియమితులైన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడుగు గంగాధర్‌ను నగర రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం సన్మానించారు. ఆయనను శాలువా,పుష్ప గుచ్ఛంతో సన్మానించి శు భా కాంక్షలు తెలియ జేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు పార్థసారధి,లడ్డా నర్సయ్య,రాజమల్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

సదాశివనగర్,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని యూపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా కంటివైద్య సహయకుడు హరికిషన్‌రావు మాట్లాడుతూ 134 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా ముగ్గురు విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ మారుతిబాబు, పాఠశాల హెచ్ఎం పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి లారీ ఢీకొని ఒకరి మృతి

కమ్మర్‌పల్లి,అక్టోబరు 30:(ఆంధ్రజ్యోతి):కమ్మర్‌పల్లి గ్రామశివారులోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో మెట్‌పల్లి వెళ్లే జాతీయరహదారిపై మంగళవారం అర్థరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో సాఫ్టవేర్ ఇంజనీర్ చింతకిషన్(27) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా మరో వ్యక్తి హరీష్‌గౌడ్ తలకు తీవ్రగాయమవగా ప్రస్తుతం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్సపొందతున్నాడు. మంగళవారం అర్థరాత్రి గ్రామం నుంచి స్కూటీ పై పెట్రోలు పోయించుకోవడానికి వెళ్తుండగా బంక్ మీపంలో మెట్‌పల్లి నుంచి ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొట్టడంతో స్కూటీపై ఉన్న ఇద్దరు రోడ్డుపై ఎగిరిపడ్డారు. ఈ ప్రమాదంలో చింత కిషన్ అక్కడికక్కడే మరణించగా వెనక కూర్చున్న హరీష్‌గౌడ్‌కు గాయాలయ్యాయి. మరొకి పరిస్థితి విషమంగా ఉందన్నారు. పోలీసులు ఘటన స్థలం చేరుకుని చింత కిషన్ మృతదేహనికి పంచినామా అనంతరం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం, హరీష్‌గౌడ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర అసుపత్రికి తరలించి మృతుని బావ చిలుక హరీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపారు. మృతునికి తండ్రి చింత ఓంకార్, తల్లి పద్మ ఉన్నారు. మృతుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా వర్కఫ్రమ్ హోంగా పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



● ఎల్లారెడ్డిలో మార్కెట్లో జోరుగా పూలు విక్రయిస్తున్న వ్యాపారులు

- పండుగకు సర్వంసిద్ధం
- లక్ష్మీ పూజలు, దీపారాధనకు ఏర్పాట్లు పూర్తి
- భారీగా టపాకాయల దుకాణాల ఏర్పాటు
- భగ్గుమంటున్న పూలతో పాటు పూజా సామగ్రి ధరలు
- మార్కెట్లో మట్టి ప్రమిదలకు భారీ డిమాండ్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొనుగోలుదారులతో సందడిగా మారిన మార్కెట్లు

రంగురంగుల దీపాలు.. భిన్నమైన మట్టి ప్రమిదలు, ఎటు చూసినా.. పూల రాశులు.. టపాసుల దుకాణాలు.. వీటికి తోడు కిక్కిరిసిన కొనుగోలుదారులతో బుధవారం మార్కెట్లన్నీ సందడిగా దర్శనమిచ్చాయి. దీపావళి పండుగను ఘనంగా జరుపుకునేందుకు పట్టణ ప్రజలు సర్వం సిద్ధం చేసుకున్నారు. నట్టింట్లో సిరులు కురిపించాలని లక్ష్మీదేవిని పూజించేందుకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నారు.



మార్కెట్లో.. దీపావళి సందడి

ఎల్లారెడ్డి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మార్కెట్లో సందడి నెలకొంది. దీనిలో భాగంగా ఎల్లారెడ్డితో పాటు పలు పట్టణ కేంద్రాల్లో భారీగా టపాసుల దుకాణాలను ఏర్పాటు చేశారు. టపాసుల దుకాణాల్లో ఫైర్ నిబంధనలు పాటించాలని ఫైర్ పోలీస్ అధికారులు యజమానులకు సూచిస్తున్నారు. రద్దీ లేని ప్రదేశంలో ఏర్పాటు చేసు కోవాలని సూచించారు. టపాసుల రేట్లు ఆకాశాన్ని అంటుతున్నాయని, ఏది ముట్టుకున్న పేలిపోయే రేట్లు ఉన్నాయంటున్నారు. గత ఏడాదితో పోలిస్తే 20 శాతం రేట్లు పెరిగాయి. టపాసులు కొనాలంటే సామాన్య ప్రజలు ఆలోచిస్తున్నారు.

మట్టి ప్రమిదలకు భలే గిరాకీ

సైజును బట్టి డజన్ మట్టి ప్రమిదలకు రూ.60 నుంచి 150 వరకు విక్రయిస్తున్నారు. అలాగే ధనలక్ష్మీ పూజకు సంబంధించిన దొంతులకు సైతం డిమాండ్ పెరిగింది. వెరైటీ రకాలను బట్టి రూ.75 నుంచి 150 వరకు విక్రయిస్తున్నారు. దీంతో ఆయా దుకాణాలు మహిళలతో సందడిగా మారాయి. పండుగ స్పెషల్ పేనీలు పాలల్లో వేసుకుని అరగించే వాటిని పండుగ స్పెషల్‌గా ప్రతి స్వీట్ కిరాణం దుకాణాలలో విక్రయిస్తున్నారు. పండుగకు ముందే వీటిని ప్రత్యేకంగా తయారు చేసి అమ్మకానికి సిద్దంగా ఉంచారు. కిలో రూ.400 నుంచి 500 వరకు విక్రయిస్తున్నారు.

కాగుతున్న నూనె ధరలు

దీపావళి అంటేనే పిండి వంటలు, స్వీట్ల పండుగ అంటారు. ప్రతీ ఇంటి నుంచి పిండి వంటల గుమగుమ వాసనలు వస్తుంటాయి. అయితే గత ఏడాది కంటే ఈ సారి వంట నూనెల ధరలు భారీగా పెరిగాయి. పెరిగిన నూనె ధరల ప్రభావం సామాన్యులు, మధ్య తరగతి వారిపై ఎక్కువగా పడింది. పిండి వంటల జోలికి పోవడం లేదు. అంతేకాకుండా సరుకుల ధరలు సైతం మండిపోతున్నాయి. బియ్యం ధరలు సామాన్యులకు అందనంత ఎత్తులోకి వెళ్లాయి.



పూల ధరలకు రెక్కలు

పండుగ సందర్భంగా పూల ధరలకు రెక్కలు వచ్చాయి. పూలు సాగు చేసిన రైతులకు దీపావళి పండుగ కాసులు కురిపిస్తుంది. అయితే డిమాండ్‌కు అనుకూలం గా మార్కెట్‌లో పూలు రాకపోవడంతో పూల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కిలో చామంతి రూ.150-200 వరకు, బంతి రూ.100, గులాబీ రూ.200 వరకు డిమాండ్ పలుకుతోంది. గుమ్మడికాయ సైజును బట్టి రూ.150-రూ.250 వరకు విక్రయిస్తున్నారు.





● నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని బహిరంగ మార్కెట్లో జోరుగా ప్లాస్టిక్ పూలు, బంతిపూల విక్రయాలు ఇలా..

ఈయేడు టపాసుల ధరలు భారీగా పెరిగాయి

: శ్రీను, వ్యాపారి, ఎల్లారెడ్డి

ఈసారి రూ.లక్ష విలువైన టపాసులు తీసుకువచ్చాం. ఈ యేడు టపాసుల ధరలు 20 శాతం వరకు పెరిగాయి. పేద, మధ్య తరగతి వారికి భారమే అవుతుంది. గత ఏడాది రెండు వేల వరకు టపాసులు కొనేవారు. ఈసారి వెయ్యి రూపాయల టపాకాయలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు.



పేకాట స్థావరాలు.. సిద్ధం!

- పేకాటరాయుళ్లకు అధికార పార్టీ నేతల అండా?!
- నాయకుల కనుసన్నల్లోనే పేకాట స్థావరాలా?
- భారీగా ఆటలో కేటీ తీసేందుకు సన్నాహాలు
- ఆటలో కేటీతో పేకాటరాయుళ్లకు విందులు
- స్థానిక ఠాణా నుంచి మొదలుకొని డివిజన్ అధికారుల వరకు ముడుపులు
- జిల్లాస్థాయి నుంచి నిఘా బృందం వస్తే.. సమాచారం చేరవేస్తున్న వైనం

నిజాంసాగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దీపావళికి పేకాటరాయుళ్ల పేకాటను మూడు రోజుల పాటు ఆడుతూ ఉంటారనేది తెలిసిందే!! అయితే ఈ ఏడాది పేకాట ఆడేందుకు అధికార పార్టీ నేతలే రహస్యంగా పేకాట స్థావరాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. నేతల అండదండలతో పేకాటరాయుళ్ల పేకాట ఆడేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలోని 25 మండలాల్లో ప్రతీ సంవత్సరం పేకాట ఆడుతూ లక్షల రూపాయలు చేతులు మారుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది ముందస్తుగానే పేకాటరాయుళ్ల ఇప్పటికే పేకాట ఆడే స్థావరాలను రహస్యంగా ఏర్పాటు చేసుకోవడం కాకుండా.. అధికార పార్టీ నేతలు ఏర్పాటు చేసిన పేకాట స్థావరాల్లో పేకాట ఆడేందుకు గ్యాంగ్‌లను ఎంపిక చేసుకున్నట్లు తెలిసింది. అధికార పార్టీ నేతలు ఎంపిక చేసిన పేకాట స్థావరాల్లో పేకాట ఆడితే పేకాట నుంచి భారీగా కేటీ తీసి 50 శాతం నిర్వాహకులకు, 50 శాతం పేకాటరాయుళ్ల విందులకు ఇచ్చేందుకు ఇప్పటికే ఒప్పందాలను చేసుకున్నట్లు తెలిసింది.

జిల్లాలోని 22 పోలీస్ స్టేషన్, మూడు డీఎస్పీ స్టేషన్‌లో 8 సర్కిల్ ఉన్నప్పటికీ.. ఠానా నుంచి మొదలుకొని డివిజన్ల స్థాయి అధికారులకు ముడుపులిచ్చేందుకు మధ్యవర్తుల ద్వారా పోలీసులతో మంతనాలు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీపావళి పండుగను పురస్కరించుకుని గత వారం రోజులుగా జిల్లాలో రహస్య స్థలాల్లో పేకాట ఆడుతూ ఉన్న విషయం తెలిసింది. జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద, జుక్కల్, పిట్లం, నిజాంసాగర్, మహమ్మద్‌నగర్, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపల్లి, గాంధారి, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాలతో పాటు బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని బీర్కూర్, బాన్సువాడ పట్టణాల్లో రహస్యంగా పేకాట వ్యవసాయ భూముల్లో వేసుకున్న విశ్రాంతి పాకల్లో భారీగా ఆడుతూనే ఉన్నట్లు ఇప్పటికే పోలీసులకు సమాచారం. దాడులు అంతంత మాత్రంగానే నిర్వహిస్తూ స్వాధీనపరుచుకున్న డబ్బులు ఎంతో కొంత పోలీసులు నొక్కి వేసి కొంత డబ్బుని కోర్టుకు చూయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పిట్లం మండల కేంద్రంలో ఇటీవల కాలంలో ప్రజాప్రతినిధులు సైతం పేకాట ఆడి ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసుల దాడికి చిక్కిన విషయం తెలిసింది. ఈ పేకాట రాయుళ్ల నుంచి కార్లు, ద్విచక్ర వాహనాలను కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన విషయం విధితమే.ఈ కేసులో పోలీసులకు హైకోర్టు అక్షింతలు వేసిన విషయం పోలీసులు జీర్ణించుకోలేకపోయారు. కోర్టు ద్వారానే సీజ్ చేసిన వాహనాలను విడిపించుకొనున్నారు.

అంతేకాకుండా, దీపావళి సందర్భంగా అనధికారి అధికార పార్టీ నేతలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు కూడా పేకాటను ఆడేందుకు సిద్దమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ పేకాటను గురువారం, శుక్రవారం, శనివారం మూడు రోజుల పాటు పేకాటరాయుళ్ల రహస్య స్థావరాలకు చేరుకుని విందులు చేసుకోవడం కాకుండా రాత్రివేళల్లో పేకాటను ఆడుతూనే ఉన్నారు. భారీగా పేకాట ఆడేందుకు పేకాటరాయుళ్ళుకార్లు, ద్విచక్ర వాహనాలను వినియోగించకుండా స్థావరాలను రహస్యంగా చేరుకుంటున్నట్లు తెలుస్తుంది. ఈ జిల్లాలో పోలీసులకు రహస్య స్థావరాల లోకేషన్లు తెలిసిన దాడులు చేయలేకపోతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నేతలు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించకుండా చూసి చూడనట్లు ఉండాలని పోలీసులను కోరినట్లు సమాచారం. మూడు రోజుల పాటు జరిగే ఈ దీపావళి పండుగను పురస్కరించుకుని ఆడే పేకాటపై పోలీస్ బాస్ సీరియస్‌గా వివరిస్తారా? పేకాట అనుమతులు ఇస్తారనేది ప్రశ్నార్థకంగా మారనుంది. మూడు రోజుల పాటు గ్రామాలలోని బెల్ట్ షాపుల్లో భారీగా మద్యం విలువలు ఉంచడమే కాకుండా అధిక ధరకు విక్రయించడం కాకుండా గ్రామాల్లో మద్యం షాపుల్లో సెట్టింగ్‌లు కూడా ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఆయా మద్యం షాపుల యజమానులు ఇప్పటికే బెల్ట్ షాపులకు భారీగా మద్యాన్ని సరఫరా చేశారు. బాన్సువాడ, బిచ్కుంద, ఎక్సైజ్ పరిధిలోని మద్యం షాపుల్లో మూడు పువ్వులు, ఆరు కాయలుగా కల్తీ మద్యాన్ని అమ్ముతున్న పోలీసులు ఎక్సైజ్ అధికారులు కేసులు చేసిన దాఖలాలు లేవు. మద్యాన్ని అధికంగా విక్రయించేబెల్టు సాపులు యజమానులకు దీపావళి సందర్భంగా నజరానా ఇవ్వనున్నట్లు తెలిసింది. అదేవిధంగా.. దీపావళి సందర్భంగా గ్రామాలలో ఇండ్లలో పేకాట ఆడే పేకాట రాయుళ్లు ఇళ్ల చుట్టూ సెంట్రీలను ఏర్పాటు చేసుకుని పోలీసులు వచ్చినట్లయితే సెల్‌ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే పేకాట రాయుళ్ళు గ్రామంలో ఇళ్లను మార్చుకునేందుకు కూడా సిద్ధంగా ఉన్నారు. జిల్లాలో పేకాట సజావుగా కొనసాగేనా? అనేది ప్రశ్నార్థకమే!!

క్రీడా సమాచారం



బీర్కూర్ జ్యోతిబా పూలే పాఠశాలలో బహుమతులతో విద్యార్థులు

జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో మెరిసిన గురుకుల విద్యార్థులు

బీర్కూర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయ విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. బీర్కూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులానికి చెందిన విద్యార్థులు వివిధ విభాగాల్లో ఏకంగా 24 బహుమతులు సాధించారు. నిజామాబాద్ జిల్లాలో ఉమ్మడి జిల్లాల మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల జిల్లాస్థాయి క్రీడా పోటీలు ఈనెల 25నుంచి 29 వరకు జరిగాయి. ఈ పోటీల్లో బీర్కూర్ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర పాటశాల విద్యార్థులు పాలుపంచుకున్నారు. అండర్-19లో ఖోఖో ఫస్ట్ ప్రైజ్, వాలీబాల్‌లో సెకండ్ ప్రైజ్, అండర్-14లో చెస్ పోటీలో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ వచ్చింది. అండర్-19లో రన్నింగ్‌లో 200 మీటర్లు, 400 మీటర్లులో ఫస్ట్ ప్రైజ్, తదితర విభాగాల్లో విద్యార్థులు తమ సత్తాను చాటారు. ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారు. ఈ క్రీడా పోటీల్లో 95 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అయితే ఇందులో 25 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ శివ తెలిపారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ శివ, ఉపాధ్యాయులు అభినందించారు.



కోతుల బెడద.. తీరేదెలా?

● బాన్సువాడ పట్టణంలో కోతుల స్వైరవిహారం ● గుంపులుగా ఇళ్లలోకి చొరబడుతున్న వైనం ● గాయాల పాలవుతున్న ప్రజలు ● పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు

ఆంధ్రజ్యోతి ఫోకస్

బాన్సువాడ టౌన్, అక్టోబరు 30: బాన్సువాడ పట్టణంలో కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. రోజురోజుకూ కోతుల సంఖ్య అమాంతంగా పెరిగిపోతోంది. రోజుకురోజుకూ పెరుగుతున్న కోతుల సంఖ్యను చూస్తుంటే బాన్సువాడ మరో కిష్కిందకాండను తలపిస్తుంది. ప్రతీ రోజు వందల సంఖ్యలో వానరాలు పలు కాలనీల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. ఏ కాలనీ వైపు కన్నెత్తి చూసినా కోతులే దర్శనమిస్తున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు వాటి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇళ్లలో చొరబడి తినుభాండారాలను ఎత్తుకెళ్లిపోతున్నాయి. ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ఎప్పటికే చాలా మంది కోతుల దాడిలో గాయాల బారిని పడి ఆస్పత్రుల పాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. వానరాలను నియంత్రించాలని ప్రజలు అధికారులకు మొరపెట్టుకుంటున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యంగానే ఉంది. ఏమి చేయలేని పరిస్థితి అంటూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. వానరసైన్యం గుంపులు గుంపులుగా తరలివస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

గాయాల బారిన ప్రజలు

వానరసైన్యం ఆహారం కోసం ఇళ్లలోకి చొరబడుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని శ్రీరామ కాలనీ , టీచర్స్‌కాలనీ , భేతాళస్వామి కాలనీ , పాతబాన్సువాడ , సంగమేశ్వర కాలనీలతో పాటు పలు కాలనీల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇళ్లలోకి ప్రవేశించి వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. తినుభాండారాలను ఎత్తుకెలుతున్నాయి. ఎవరైనా తరిమేద్దామని చూస్తే వారిపై దాడికి పాల్పడుతున్నాయి. దీంతో ప్రజలు గాయాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. పెంకిటిళ్లలో నివసించే వారి పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. కోతులు పెంకులు ఊడదీస్తున్నాయి.





● బాన్సువాడ పట్టణంలో కోతుల సంచారం ఇలా..

ఫలితం ఇవ్వని ఉపాయాలు

బాన్సువాడ పట్టణంలోని పలు కాలనీల్లో కోతులు తిష్టవేసి స్థావరాలను ఏర్పాటు చేసుకున్నాయి. వాటిని తరిమేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మంకీగన్ , టపాసులు పేల్చడం , లేజర్ లైట్ వేయడం వంటి ఉపాయాలు కూడా కోతులను తరమడంలో నిష్ప్రయోజనంగా మారుతున్నాయి. ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలన్నా , తిరిగి ఇళ్లకు చేరుకోవాలన్నా కోతుల బెడద తప్పడం లేదు. ఏం చేయాలో తోచక బిక్కు బిక్కు మంటూ ఇళ్లకే పరిమితమవుతున్నారు.

భయపడుతున్న పాఠశాల విద్యార్థులు

కోతులు విచ్చలవిడిగా పట్టణంలో తిరుగుతుండడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు జంకుతున్నారు. ఇళ్లలో నుంచి బయటకు వెళ్లే పరిస్థితి కానరావడం లేదు. కర్రలు చేతబట్టి తరిమితే తప్ప బయటకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ తరిమికొట్టే వారిని గాయపరుస్తున్నాయి. గత కొన్ని రోజుల క్రితం పాతబాన్సువాడలో ఇద్దరు వ్యక్తులపై కోతులు దాడి చేయడంతో వారు గాయాల బారినపడ్డారు. కోతుల ధాటికి పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, గృహిణులు, వృద్ధులు భయాందోళనలో ఉండిపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

బాన్సువాడ పట్టణంలో కోతుల నియంత్రణలో అధికారులు విఫలమయ్యారనే చెప్పవచ్చు. కోతులే కదా అని చాలా తేలికగా తీసుకుంటున్నారు. కానీ వాటి నియంత్రణ కోసం కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. పరిస్థితి ఇలాగే ఉంటే మాత్రం రాబోయే రోజుల్లో జన సంచారంతో వానర సంచారం కూడా రోడ్లపై ఉంటుందనే చెప్పవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇంటి పెంకులు ఊడబీకుతున్నాయి

: పొరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పాత బాన్సువాడ



కోతులు స్వైర విహారం చేస్తూ ఇంటి పెంకులను ఊడబీకుతున్నాయి. ఇళ్లలోకి చొరబడటంతో పాటు వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. తరిమేద్దామని వెళితే దాడులకు పాల్పడుతున్నాయి. చిన్న పిల్లలైతే కోతుల కనబడగానే భయపడుతున్నారు. అధికారులు స్పందించి కోతుల బెడద తీర్చాలని కోరుతున్నాం.

కోతుల నియంత్రణ కోసం కృషి చేస్తున్నాం

: శ్రీహరిరాజు, ఇన్‌చార్జీ మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ



బాన్సువాడ పట్టణంలో కోతుల స్వైరవిహారం చేస్తున్న మాట వాస్తవమే. అయితే, కోతుల నియంత్రణ కోసం కృషి చేస్తున్నాం. దీనికి సంబంధించి స్థానిక పాలకులు, సంబంధిత శాఖల అధికారులతో చర్చించడం జరుగుతుంది. కోతుల నియంత్రణ విషయమై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం.

ఉద్యోగులకు నాలుగు డీఏలను మంజూరు చేయాలి

దోమకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు దీపావళి కానుకగా ఒక్క డీఏ మంజూరు చేయడం బాధాకరమని పంచాయతీ రాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం సంఘం బ్లాక్ ప్రధాన కార్యదర్శి నిజ్జని శ్రీకాంత్ అన్నారు. పెండింగ్‌లో 5 డీఏలుండగా ఒక్క డీఏ మాత్రమే మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం ద్వారా ఉద్యోగులు నిరాశ చెందుతున్నారని అన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు దోమకొండ గడికోట విద్యార్థి

దోమకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు దోమకొండ గడికోట విద్యార్థి ఎంపికైనట్లు కోచ్ ప్రతాప్ దాస్ బుధవారం తెలిపారు. దోమకొండ గడికోటలో శిక్షణ తీసుకుంటున్న అండర్-19 విభాగంలో నవీన్ ఎంపికైనట్లు కోచ్ తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో నవీన్ ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. నవంబరు 11న గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో నవీన్ పాల్గొంటాడన్నారు.

పెద్దశక్కర్గలో పౌరహక్కుల దినోత్సవం

మద్నూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దశక్కర్గలో పౌరహక్కుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. ప్రతినెల చివరి రోజున పౌరహక్కుల దినోత్సవంపై కార్యక్రమం ఒక్కోనెలలో ఒక గ్రామంలో నిర్వహిస్తున్నట్లు మద్నూర్ గిర్దావర్ శంకర్ తెలిపారు. బుధవారం పెద్దశక్కర్గ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమంను రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ ప్రజలు తమ హక్కులను కాపాడుకోవడానికి వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మద్నూర్ మండల గిర్దావర్ ఎం.శంకర్, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ఆఫీసర్ సందీప్, కానిస్టేబుల్ ఓంకార్ పాల్గొన్నారు.

డివైడర్‌ను కూల్చివేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డిటౌన్,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఓల్డ్ ఎన్‌హెచ్- 7 రోడ్డుపై జీవీఎస్‌కళాశాల వద్ద నిర్మాణం చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేసిన మాజీకౌన్సిలర్ రామ్మోహన్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు మధ్యలో డివైడర్‌ను కూల్చివేయించి సెంటర్ లైట్‌ను తొలగించి ఎలక్ట్రికల్ పోల్‌ను తీసుకెళ్లారని తెలిపారు. అధికారులకు ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా తిరిగి యథావిధిగా డివైడర్‌ను నిర్మించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరామని తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

తాడ్వాయి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందాపూర్‌లో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించినట్లు మండల టీఎంసీ అధ్యక్షులు సాయిరెడ్డి తెలిపారు. గ్రామంలో మొత్తం 16 ఆవులకు, 124 గేదెలకు టీకాలు వేయడం జరిగిందన్నారు. పాడి రైతులు తప్పకుండా పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డా.అనూష పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురి మృతి

మాచారెడ్డి,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలంలోని భవానీపేట స్టేజీ వద్ద ఎదురెదురుగా వస్తున్న ఆటో బైకు ఢీకొని ఒకరు మృతిచెందారు. దోమకొండ మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన సుబ్బారావు (36) కామారెడ్డి నుంచి పాల్వంచ వైపు వస్తుండగా పాల్వంచ నుంచి కామారెడ్డికి బండలలోడుతో వెళ్తున్న ఆటో ఢీకొంది. దీంతో బైక్‌పై నుంచి కింద పడిన సుబ్బారావు తీవ్ర గాయాలపాలై మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ అనిల్ తెలిపారు.

బీర్కూర్: దామరంచ గ్రామసమీపంలోని ప్రధాన రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బాన్సువాడ మండలం బోర్లం గ్రా మానికి చెందిన జోగోళ్ళ




మృతిచెందిన సుబ్బారావు

ప్రవీణ్ (24) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బాన్సువాడ మండలం బోర్లం గ్రామానికి చెందిన ప్రవీణ్ బుధవారం ద్విచక్ర వాహనంపై హాస్టల్‌లో ఉన్న తన అత్తాగారింటికి బయలుదేరాడు. ఈ క్రమంలో దామరంచ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాన్సువా డకు చెందిన వాహనం డ్రైవర్ ఓట్లం వెంకటేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత మూడేళ్ళక్రితం ప్రవీణ్‌కు వివాహం జరి గింది. రెండు నెలల క్రితం పాప పుట్టింది. భార్య సుశీల, పాపను చూసేందు కోసం వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది.

పిట్లం మార్కెట్ కమిటీ యార్డు అభివృద్ధికి కృషి

- మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్‌కుమార్

పిట్లం అక్టోబర్ 30 : పిట్లం వ్యవసాయమార్కెట్ కమిటీ యార్డ్‌ను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ సహకారంతో అభివృద్ధి చెస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్‌కుమార్ అన్నారు. చైర్మన్‌గా ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్న తర్వాత బుధవారం పిట్లంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగానే చైర్మన్ నియామకం జరిగిందన్నారు. ఎమ్మెల్యే రాజకీయాలలో యువనాయకులను ప్రోత్సహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు చైర్మన్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మార్కెట్ యార్డ్‌లో ధాన్యం విక్రయించే రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర దక్కే విధంగా పాలకవర్గం పాటు పడుతుందని తెలిపారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని, మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అదే విధంగా మార్కెట్ పరిధిలోని ధాన్యం స్టోరేజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ మనోజ్‌కుమార్

పెంచే విధంగా గిడ్డంగుల నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, మల్లికార్జున్, అశోక్, చంద్రశేఖర్, ఇమ్ము రోజ్, మొయిన్, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

మాచారెడ్డి,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):కట్టుకున్న భార్య కాపురానికి రావడం లేదని మనోవేదనకు గురై మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన నూనె ప్రవీణ్ (21) ఆత్మహత్యచేసుకున్నాడు. సదాశివనగర్ మండల కేంద్రంకు చెందిన భాగ్యతో ఏడాది క్రితం వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది.దీంతో మనస్థాపనికి గురైన ప్రవీణ్ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడు. తల్లి రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు.

ప్రభుత్వ సలహాదారునికి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీకి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియచంద్రశేఖర్‌రెడ్డిలు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ ప్రజలు దీపావళి పండుగను అంగరంగవైభవంగా జరుపుకోవాలని టపాకాయలు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, చిన్నపిల్లలపై శ్రద్ధ వహించాలని సూచించారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్‌పర్సన్

విద్యుత్ షాక్‌తో యువకుడికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో తీవ్ర గాయా లైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివ రాల ప్రకారం ఎల్లారెడ్డి మండలంలోని సాతెల్లి గ్రామానికి చెందిన హరీష్ అనే యువకుడు మంగళవారం రాత్రి ధాన్యాన్ని ట్రాక్టర్ ద్వారా కొనుగోలు కేంద్రం వద్ద పోస్తుండగా, ట్రాక్టర్ ట్రాలీకి పక్కనే ఉన్న లెవెన్ కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్ సరఫరా కావడంతో కాళ్ళు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న రైతులు గమనించి వైద్యం కోసం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడికి తల్లిదండ్రులు లేరని, ఊర్లో ఒంటరిగా ఉంటూ కూలీ పనిచేస్తూ ఉంటూ జీవనం సాగిస్తాడని గ్రామస్తులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని వినతి



బాన్సువాడ సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బాన్సువాడటౌన్, అక్టోబరు 30: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ, ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలంటూ బుధవారం మాలమహానాడు నాయకులు బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మలమహానాడు నాయకులు మాట్లాడుతూ ఎస్సీలు ఐక్యంగా ఉండకూడదనే ఉద్దేశంతో కేంద్రం ఎస్సీ వర్గీకరణ చేసిందని మండిపడ్డారు. వర్గీకరణను రద్దు చేసేంతరవకు పోరాటం చేస్తామన్నారు.

సమగ్ర సర్వేపై అవగాహన

ఎల్లారెడ్డి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నవంబర్ 6 నుంచి చేపట్టే ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కుటుంబ సర్వేపై ఎన్యూమరేటర్లకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే షెడ్యూల్‌పై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, ఎంపీవో ప్రకాష్, ఎంఈవో వెంకటేశం, ఎమ్యూనరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట : మండలంలో నవంబర్ 1 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఇంటింటి సర్వేపై సూపర్‌వైజర్లు, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఫీల్డ్‌అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులకు రైతు వేదికలో శిక్షణను ఇచ్చారు. ఇంటింటి సర్వేలో సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య అంశాలపై సర్వే చేస్తున్నట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు.

తాడ్వాయి: ఇంటింటి ఆర్థిక సామాజిక కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తాడ్వాయి మండల అధికారి సయ్యద్ సాజీద్ అలీ అన్నారు. ఈయన బుధవారం మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో అధికారులతో అవగాహన సద స్సు నిర్వహించారు.

దోమకొండ : దోమకొండ, బీబీపేట మండలాల్లో బుధవారం సోషల్ ఎకనామిక్ సర్వే ఎనిమినేటర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోలు ప్రవీణ్‌కుమార్, పూర్ణచంద్రోదయ కుమార్‌లు వివిధ అంశాలపై వివరించారు.

బీర్కూర్: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బుధవారం సమగ్ర ఇంటింటికి కుటుంబ సర్వేపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సర్వే నెంబర్ 6 నుంచి ప్రారంభం కానుందని అధికారులు తెలిపారు. కార్యదర్శులు, అంగన్ వాడీ ఉపాధ్యాయునులు, ఆశాకార్యకర్తలు, ఉపాధిహామీ క్షేత్ర సహాయకులకు, ఐకేపీ సీసీలు, వీవోఏలు హాజరయ్యారు.

సదాశివనగర్ : మండలంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, ఉపాధి కులసర్వే పక్కగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి చందర్‌నాయక్ తెలిపారు. బుధవారం సదాశివనగర్‌రైతువేదికలో మండలస్థాయిలో ఎన్యుమటరేటర్లకు,సూపర్‌వైజర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్, ఎంపీఓ సురేందర్‌రెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.